చినబూరుగుపుట్టులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని సంతారి పంచాయతీ చిన బూరుగుపుట్టు గ్రామంలో గురువారం ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బి అనూష ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల రోగులను వైద్య సేవలు అందించారు. ప్రతీ నెలలో రెండు లేదా మూడు సార్లు పంచాయితీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వైద్యాధికారిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కె.చంద్రమ్మ, ఎంఎల్‌హెచ్‌పి ఎల్.లావణ్య, హెచ్ వి. శాంతామని, 104 సిబ్బంది డిప శివ, మహేశ్వరి, ఆశా వర్కర్లు కుడేలి పుష్పవతి పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఆశా వర్కర్లుగా గుర్తించేదెన్నడో?

▶▶ పదేళ్ల నుంచి పని చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం ▶▶ ఆవేదనలో 752 మంది సిహెచ్‌డబ్ల్యులు

ప్రజాశక్తి-పాడేరు: ఏళ్ల తరబడి పని చేస్తున్నా ఆశావర్కర్లుగా తమను గుర్తించక పోవడంపై అల్లూరి జిల్లాలోని సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు)(సిహెచ్‌డబ్ల్యు)లు ఆవేదన చెందుతున్నారు. పాతికేళ్ల క్రితం పాడేరు ఏజెన్సీలో వ్యాధులు చుట్టుముట్టి వైద్య సేవలు అందని పరిస్థితుల్లో సతమతమైన మారుమూల ప్రాంతాల గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకు సామాజిక ఆరోగ్య కార్యకర్తలను నియమించారు. తాము అందించే సేవలకు సరైన వేతనం పొందలేని పరిస్థితుల్లో తరచూ ఆందోళన బాట పడుతున్నారు. అయినప్పటికీ వారి పట్ల పాలన యంత్రాంగం చిన్న చూపు చూస్తోంది.

ఏజెన్సీలోని ప్రతి గ్రామానికి ఒక సామాజిక ఆరోగ్య కార్యకర్తను 2000 సంవత్సరానికి ముందే సుమారు మూడు వేల మంది నియమితులయ్యారు. తర్వాత దపదపాలుగా ఈ సామాజిక ఆరోగ్య కార్యకర్తల సంఖ్య నాలుగు వేలు దాటింది. ఇందులో 3,200 మందికి శిక్షణ ఇచ్చి ఆశా వర్కర్లుగా అప్‌గ్రేడ్ చేశారు. వీరిలో ఇంకా 752 మంది సామాజిక ఆరోగ్య కార్యకర్తలను ఆశా వర్కర్లుగా గుర్తించ లేదు పదేళ్ల క్రితమే వీరంతా నియమితులయ్యారు. పాడేరు డివిజన్‌లో 11 మండలాల పరిధిలో పలుచోట్ల వీరు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామస్థాయిలో వీరికి ఇచ్చే పారి తోషికం చాలా తక్కువ. నెలకు రూ.4వేల వేతనం ఇస్తున్నారు. ఆశాల శిక్షణ పొందిన సిహెచ్‌బ్ల్యులకు ఆశా వర్కర్ల అర్హత లేక పోవడంతో వేతన విషయంలోనూ వివక్షకు గురవుతున్నారు. అలాగే సామాజిక ఆరోగ్య కార్యకర్తలు పలు సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారు. పల్స్ పోలియో పారితోషికం సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారు.

జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట మండలాల్లో కొందరు సిహెచ్‌బ్ల్యులకు మూడు సంవత్సరాల పల్స్ పోలియో బకాయిలు చెల్లించ లేదు. మరికొన్ని పీహెచ్సీల పరిధిలోని సిహెచ్‌బ్ల్యులకు వేతన బకాయిలు కూడా ఉన్నాయి. యూనిఫామ్‌లు వీరికి పంపిణీ కాలేదు. యూనిఫామ్ వీరు స్వంతంగా కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో, అదనంగా ఆర్థిక భారం ఎదుర్కోక తప్పడం లేదని సిహెచ్‌డబ్ల్యులు వాపోతున్నారు. తమకు ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవని, చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నామన్నారు. ఆశా వర్కర్ల గా గుర్తించి నెలకు పది వేల వేతనంతో పాటు యూనిఫామ్, బీమా సౌకర్యం కల్పించాలని, గ్రామాల్లో జనాభాకు తగ్గట్టుగా తమకు మందులు పంపిణీ చేయాలని సామాజిక ఆరోగ్య కార్యకర్తలు కోరుతున్నారు.

ఆందోళన చేపడుతున్న సిహెచ్‌డబ్ల్యులు (ఫైల్ ఫోటో)

మాతా శిశు మరణాలపై..

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

- సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి - అనంతగిరి : మండలంలో గత నెల రోజుల నుండి సంభవిస్తున్న మాతా శిశు మరణాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సిపిఎం జెడ్పిటిసి దిసరి గంగరాజు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడుతూ, అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎగువసభ పంచాయతీ పొర్ల పొదొర్ గ్రామంలో నెల రోజుల్లో ఐదుగురు శిశువులు మృతితో పాటు లుంగపర్తి ఆరోగ్య కేంద్రం పరిధి వాలసి పంచాయతీలో సొవేరి లచ్చు భార్య (35) రెండు నెలల బాలింత బుధవారం రక్తహీనతతో బాధపడుతూ సకాలంలో సరైన వైద్య సేవలు అందక మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరం, పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో అనేకమంది గర్భిణీలు, బాలింతలు, శిశువులు పదుల సంఖ్యలో రోజు రోజుకు మృతి చెందుతున్నా ప్రభుత్వానికి పట్టదా అని ఆయన మండిపడ్డారు. మాతా శిశు మరణాలు అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం పత్రికల ప్రకటనలకే పరిమితం తప్ప ఆచరణలో అమలు కాలేదన్నారు. జిల్లా, డివిజన్ , మండల స్థాయి వైద్య శాఖల అధికారులు నిర్లక్ష్య కూడా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రత్యేక మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మాతా శిశు మరణాలను అరికట్టాలని, గర్భిణీలకు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించాలని ఆయన కోరారు.

గ్రామసభకు హాజరైన గిరిజనులు

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా..

పోరాట కమిటీల తీర్మానం

ప్రజాశక్తి-అనంతగిరి: గిరిజన ప్రజల మనుగడను దెబ్బ తీసే హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు వ్యతిరేకంగా పెద్దకోట, పినకోట పంచాయతీల పోరాట కమిటీలు తీర్మానం చేసి ఆమోదించాయి. గురువారం పంచాయతీ కేంద్రంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ సభ్యులు నారంగి. సింహాసనం అధ్యక్షతన రెండు పంచాయతీల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందరర్భంగా నారంగి. సింహాచలం, సిరిగం. బైరమూర్తి, గొర్లి. ఆనందులు మాట్లాడుతూ, రెండు పంచాయతీ పరిధిలకు ఆనుకుని ఉన్న రేగులపాలెం సమీపంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. పవర్ ప్రాజెక్టు నిర్మాణంతో సాగు భూములు, పంట పొలాలు, జీడి మామిడి, చింత వంటి అటవీ తోటలతో పాటు గిరిజన మనుగడకే పెద్ద ముప్పు వాటిల్లుతుందని తెలిపారు.అనుమతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం వెనక్కు తీసుకోవాలని, లేని పక్షాన అల్లూరి స్ఫూర్తితో గిరిజన సాంప్రదాయ ఆయుధాలతో తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రాజెక్టుల నిర్మాణానికి సర్వేలకు వచ్చిన బృందాలను తరిమికొట్టడం జరిగిందన్నారు. ఇప్పటికైనా వెనక్కి తగ్గకపోతే భవిష్యత్తులో మరింత పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జన్ని. ఈశ్వరరావు, రఘురాజు, పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్-ముల్లుమెట్టలో పర్యటన

ప్రజాశక్తి-హుకుంపేట: కాఫీ, మిరియాలు, పసుపు రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పంటలకు సరైన లాభసాటి ధరకే అమ్ముకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ రైతులకు సూచించారు. గురువారం హుకుంపేట మండలం తాడిగిరి పంచాయతిలో పివిటిజి గ్రామం ముల్లుమెట్ట గ్రామాన్ని సందర్శించి కాఫీ, మిరియాలు, పసుపు రైతులతో మాట్లాడి పంటలను పరిశీలించి ధరలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రైతులు మాట్లాడుతూ, గత ఏడాది అతి తక్కువ ధరకు సంతలలో అమ్మేవారమని, ఈ ఏడాది మంచి ధరకే అముతున్నామని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ, కాఫీ రూ.250 లకు తక్కువ కాకుండా అమ్ముకునే అవకాశం ఉందని, అదేవిధంగా పసుపు, మిరియాలు కూడా మంచి రేటు లభించే విధంగా కొనుగోలుదారులను గ్రామానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముల్లుమెట్టలో సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తడిగిరి వైస్ సర్పంచ్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కిల్లో రామారావు, కొంతమంది రైతులు తీసుకు వెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ ఒరిగిపోయిన విధ్యుత్ స్థంబాలను పరిశీలించి మార్చాలని విధ్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. నీటి సమస్య పై స్పందిస్తూ గ్రామాన్ని సందర్శించి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని ఆదేశించారు. గృహ నిర్మాణ బిల్లులు అందలేదని కొంతమంది కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా అధికారులు పరిశీలించి నివేదిక అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంల కాఫీ డిపార్ట్‌మెంట్ అధికారులు సబ్ అసిస్టెంట్ బాలం నాయుడు, లైజన్ వర్కర్ కంభ శ్రీను, వాసు, రైతులు కిల్లో బుజ్జిబాబు, నాగేశ్వరరావు, మల్లేశ్వరరావు, సీదరి సుబ్బారావు, రాంబాబు, వెంకట్రావు, వాలంటీర్ మర్రి కమల, సీదారి అప్పలమ్మ, అంగన్ వాడి టీచర్ పాంగి జ్యోతి, ఆశ వర్కర్ కోసాయి, మహిళలు గంగమ్మ, సుబ్బలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా

ముఖ్య కూడళ్లు, చెక్‌పోస్టుల వద్ద పోలీసుల వాహన తనిఖీలు

సీలేరు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: గంజాయి అక్రమ రవాణాపై స్థానిక పోలీసులు గట్టినిఘా పెట్టారు. ఇందులో భాగంగానే ప్రత్యేక దృష్టి సారించి వాహన తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. గురవారం సాయంత్రం జికె. వీధి మండలం సీలేరు ఎపి జెన్‌కో చెక్‌పోస్టు వద్ద సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతోపాటు సాయుధులైన సిఆర్‌పిఎఫ్ బలగాలతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాల రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి, యజమానులు వివరాలపై ఆరా తీసి, నిర్ధారించుకున్నాకే విడిచిపెట్టారు. బైక్‌లు, ఆటోలు, కార్లు తదితర అన్ని వాహనాలను ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తూ, గంజాయి అక్రమ రవాణాకు ఎటువంటి ఆస్కారం లేకుండా వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానితులని ప్రశ్నించి విడిచిపెట్టారు. ఆంధ్రా, ఒడిశాతోపాటు మన్యం నుంచి వచ్చే పోయే వాహనాలను నిలిపివేసి తనిఖీలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ, ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం మన్యం నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణాకు ఆస్కారం ఉండడంతో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తనిఖీలు చేపడుతున్నామన్నారు. ముఖ్య కూడళ్లలో స్థానిక పోలీసులతోపాటు సిఆర్‌పిఎఫ్ బలగాలతో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు. ప్రజలంతా పండుగ సందడిలో ఉన్న నేపథ్యంలో స్మగ్లర్లు దీన్ని అవకాశంగా మలుచుకుని, గంజాయి అక్రమ రవాణా చేసే అవకాశం ఉండొచ్చన్న అనుమానంతోనే తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. సీలేరు పరిసర ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లతోపాటు ప్రధాన రహదారులు, అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేపడతామని వెల్లడించారు.

ఎల్ఐసిని ప్రయివేటీకరించొద్దు

భోజన విరామ సమయంలో ఉద్యోగుల నిరసన

పజాశక్తి-చోడవరం : జాతీయబీమా సంస్థ ఎల్ఐసిని ప్రయివేటీకరించకుండా ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఎల్ఐసి ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం ఎల్ఐసి జాతీయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు.1956లో జాతీయీకరణ తర్వాత ఎల్ఐసి దినదినాభివృద్ధి చెందుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు బాసటగా నిలిచిందని, లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చుకుందన్నారు. అలాంటి సంస్థను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు.

ఎల్ఐసితోపాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కల్యాణ్ కుమార్, సహాయ కార్యదర్శి నూకరాజు, కోశాధికారి హర్షత్, సభ్యులు పద్మజ, కెపిఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

డి.పోలవరం అభివృద్ధిపై నిర్లక్ష్యం

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి/ అడ్డతీగల : అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోకపోవడం వల్లే అడ్డతీగల మండలం దుచ్చర్తి పంచాయతీ డిపోలవరం గ్రామం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రామారావు ఆధ్వర్యంలో గిరిజన సంఘ నేతల బృందం డి.పోలవరం గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు పలు సమస్యలను గిరిజన సంఘం దృష్టికి తెచ్చారు.

ముఖ్యంగా డి పోలవరం గ్రామానికి సరైన రహదారి సదుపాయం లేదని, దీంతో అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అర్థాంతరంగా నిలిచిపోయిన రహదారి పనులపై అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ అది పనిచేయక పోవడంతో గిరిజనులు తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ సమీపంలోని కొండవాగు నీటిని వాడాల్సి వస్తోందన్నారు. గ్రామంలో ఒక పాఠశాల తప్ప, ఎటువంటి అభివృద్ధి లేదని విన్నవించారు.

దీనిపై గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ, కనీస సౌకర్యాలు లేక, ఎటువంటి అభివృద్ధికి నోచుకోని డి.పోలవరం గ్రామంలో సిసిరోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలతోపాటు అసంపూర్తి ప్రధాన రహదారిని పూర్తిచేయడం, రక్షితనీటి పథకాన్ని వినియోగంలోకి తేవడం వంటి సమస్యలను అధికారులు వెంటనే స్పందించి, పరిష్కరించాలని కోరారు. లేకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల సహాయ కార్యదర్శి జర్తా రాజబాబు, గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత రాష్ట్ర అధ్యక్షులు రామారావు

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

డైరీ, కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-విఆర్ పురం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రూపొందించిన 2023 కేలండర్, డైరీని రేఖపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఫణీంద్ర గురవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయ విద్యాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న యుటిఎఫ్ రూపొందించిన కేలండర్, డైరీ అవసరమైన సమాచారంతో బాగుందని కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఫణీంద్రతోపాటు కార్యాలయ సిబ్బందికి యుటిఎఫ్ నేతలు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ మండల సీనియర్ సభ్యులు పూసం రామరావు, బంధం నాగేశ్వరరావు నూనె చిన్నబొజ్జి, అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎన్ జగదీశ్, సభ్యులు ఎస్.అజయ్‌కుమార్, నూనె ప్రసాద్, ఎం.బాబు, ఒ.మంగ రావురెడ్డి, రమేష్‌బాబు, గురుసాయి నవీన్, శ్రీనివాసరెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనానికి ఆర్‌అండ్‌బి అధికారుల స్పందన

ప్రజాశక్తి- సీలేరు: ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న కల్వర్టులు వద్ద ఆర్‌అండ్‌బి అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కల్వర్టుల నిర్మాణం కోసం పునాది గోతులు తీసిన కాంట్రాక్టర్లు, పనులు చేపట్టడంతో జాప్యం వల్ల ఆయా కల్వర్టుల వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, కనీసం హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయని ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాశక్తిలో వెలువడిన కథనంతో అధికారుల్లో కదలిక వచ్చింది. చింతపల్లి సబ్ డివిజన్ ఆర్ అండ్‌బి అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ చల్లని శిల్ప నుంచి సీలేరు వరకు ప్రధాన రహదారిలో 14 కల్వర్టులు నిర్మాణానికి కాంట్రాక్టర్‌కు సంబంధిత ఆర్‌అండ్‌బి ఆధికారులు పనులు అప్పగించారు. కాంట్రాక్టు పొందిన గుత్తేదారు, కల్వర్టులు నిర్మాణం చేపట్టే క్రమంలో ప్రధాన రహదారిలో కల్వర్టుల వద్ద ఇరువైపులా పెద్దగోతులు తవ్వి నిర్మాణ పనులు మొదలెట్టారు. అయితే ఎందుకనో పనులు నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో నిర్మాణంలో వున్న కల్వర్టుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక చోట్ల మలుపులున్న ప్రాంతంలో కల్వర్టుల కోసం గోతులు తవ్వి వదిలేయడం వల్ల ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే ఆస్కారముందని ఆందోళన చెందుతున్నారు.

నిర్మాణంలో ఉన్న కల్వర్టుల వద్ద తవ్వి వదిలేసిన గోతులు

ఇదే ప్రధాన మార్గం కావడంతో మైదానప్రాంతం నుంచి ఏజెన్సీ మీదుగా అటువైపు మైదానానికి నిత్యం అనేక బస్సులు, కారులు, ఆటోలు, బైక్‌లతోపాటు ఇతర వాహనాలు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడాన్ని వాహనచోదకులంతా అధికారుల నిర్లక్ష్యంగా మండిపడుతున్నారు. ఎట్టకేలకు ప్రజాశక్తి కథనంతోనైనా స్పందించి హెచ్చరిక బోర్డుల ఏర్పాటును స్వాగతిస్తున్నారు. అయితే ఉన్న ఏకైక మార్గంలో ఎక్కడిక్కడే కల్వర్టుల కోసం గోతులు తీసి వదిలేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కల్వర్టు నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి, పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బి అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు

కల్వర్టు పనులు పునఃప్రారంభం

చల్లని శిల్ప నుంచి సీలేరు వరకు నిలిచిపోయిన కల్వర్టు నిర్మాణ పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. కల్వర్టు వద్ద కాంక్రీట్ పనులు ప్రస్తుం చేపడుతున్నారు. కల్వర్టులు నిర్మాణం పూర్తయ్యేంతవరకు పనులను ఆపకుండా చేపట్టి, పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. హెచ్చరిక బోర్డుల కంటే కల్వర్టుల నిర్మాణం పూర్తయితేనే ప్రమాదభయం తొలగిపోతుందని వాహనచోదకులు అంటున్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

జియో టవర్‌కు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు

మండలంలో పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామంలో జియో టవర్ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ మండి బాబూరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు పంచాయతీలో సిగల్స్ లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పడిగాపులు కాయాల్సి వచ్చేదని తెలిపారు. ప్రజలు పడుతున్న సాంకేతిక సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, దీంతో సెల్ టవర్ మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి తమర్భ గణపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చాపరాయి టెండర్ పాట నిర్వహించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ

స్థానిక పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం టెండర్ పాటను నిర్వహించాలని వైసిపి మండల అధ్యక్షుడు ఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతేడాది పాడిన టెండర్ గడువు ఈ నెల 17తో ముగిసిందన్నారు. అయినా కొత్త టెండర్ పాట నిర్వహించకపోవడంతో పాత టెండర్‌దారులు మూడు రోజులుగా వసూలు చేసుకుంటున్నారని చెప్పారు. కొత్త టెండర్ పాట విషయంలో నిర్లక్ష్యం చేయకుండా కొత్త టెండర్ పాట నిర్వహించి చాపరాయి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆదివాసీల హక్కుల పరిరక్షణకు పోరాటాలు

ప్రజాశక్తి- పెదబయలు

ఆదివాసీల హక్కుల పరిరక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని ఆదివాసీ జెఎసి అల్లూరి జిల్లా కన్వీనర్ రామారావుదొర పిలుపునిచ్చారు. మండలంలోని పర్రెడ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. పర్రెడ పంచాయతీ పరిధి చేరువీధిలో మాజీ సర్పంచ్ వెచ్చంగి లింగన్న, గ్రామ పెద్దలు ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు దొర మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని తెలిపారు. ఆదివాసీ సాంస్కృతిక జీవనానికి నిలయంగా ఉన్న పల్లెలకు బయట వ్యక్తులు చొరబడి ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన యువత ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బొండా బొంజన్న, వెచ్చంగి సోమన్న దొర, మల్లేశ్వరరావు, గ్రామ వాలంటీరు వి.చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

శిశు, విద్యార్థుల మరణాలపై

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- మృత్యువాత నివారణకు బాధ్యతాయుతమైన చర్యలు చేపట్టాలి

- సిపిఎం మండల కార్యదర్శి పృథ్వీరాజ్ - రాజేష్, ఆశ దంపతులకు పరామర్శ

రాజేష్ దంపతులతో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పృథ్వీరాజ్

ప్రజాశక్తి - పెదబయలు

ఏజెన్సీలో వరుస శిశు, పాఠశాలల విద్యార్థుల మరణాల విషయమై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి వాస్తవాలను బయటపెట్టాలని సిపిఎం మండల కార్యదర్శి కొమ్మ పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో మెరుగైన వైద్యం అందించడానికి, మరణాలు నివారణకు బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని సీతగుంట పంచాయతీకి చెందిన సందడి రాజేష్, ఆశ దంపతులకు జన్మించిన నాలుగు నెలల మగ బిడ్డ బుధవారం పాడేరు ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందుతూ మరణించిన విషయం తెలుసుకున్న పృథ్వీరాజ్, సిపిఎం ఉపసర్పంచ్ బొండా గంగాధరంతో కలిసి గురువారం రాజేష్ దంపతులను పరామర్శించి ఓదార్చారు. బిడ్డ చనిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా గిరిజన ప్రాంతంలో పసిపిల్లలు, పాఠశాలల్లో విద్యార్థులు మృతి చెందుతున్నారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ చేసి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాలు, బాధిత తల్లితండ్రులు, గిరిజనులు కోరుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికిగాని, ఐటిడిఎ పిఒకు గాని, జిల్లా అధికారులకు గాని ఏ మాత్రమూ పట్టడం లేదని విమర్శించారు. అధికారుల నుంచి సరైన చర్యలు లేకపోవడం వల్లే వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ బలంగా ఉంటే ఇటువంటి మరణాలు జరిగేవి కావని పేర్కొన్నారు. రాజేష్ దంపతులకు ముందు పుట్టిన మగ బిడ్డ కూడా మృతి చెందాడని, ఆనాడే తమ బిడ్డ ఎందువల్ల చనిపోయారో కారణం చెప్పాలని ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేశారని, అయినా నేటికీ చర్య తీసుకోకపోవడం వల్లే మరో బిడ్డను కోల్పోవాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆస్మా, ఫిట్స్ ఉండటం వల్లే రాజేష్ బిడ్డను బతికించలేకపోయామని పాడేరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ చెప్పిన మాటల్లో నిజం లేదని, బాబుకు ఫిట్స్, ఆస్మా ఏమీ లేదని, కఫంతో ఇబ్బంది పడుతున్న తమ బిడ్డను చంపేశారని తల్లిదండ్రులు చెబుతున్నారని పేర్కొన్నారు. శిశు, విద్యార్థుల మరణం సందర్భంలో వాస్తవాలను బయట పెట్టకుండా కప్పిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఈ మరణాలపై విచారణ చేయాలని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు.

ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణను సరెండర్ చేయాలి

- ఎపి గిరిజన సంఘం డిమాండ్

- 32వ రోజు కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి పాడేరు

గిరిజనుల సమస్యలను పట్టించుకోని పాడేరు ఐటిడిఎ పీవో రోణంకి గోపాలకృష్ణను ప్రభుత్వం తక్షణమే సరెండర్ చేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాలిక లక్కు, నాయకులు బి.సన్నిబాబు డిమాండ్ చేశారు. గిరిజన పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పాడేరు ఐటిడిఎ గేట్ ముందు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి 32వ రోజుకు చేరింది. ఈ రిలే దీక్షలను సందర్శించి సంఘీభావం తెలిపిన లక్కు, సన్నిబాబు మాట్లాడుతూ విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులు చనిపోతే మాకెందుకులే అన్నంత ధీమాగా అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు, మరణాలను అరికట్టేందుకు తక్షణమే హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు. గిరిజన ఆశ్రమ విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపే విధంగా ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని, దీనిపై అల్లూరి జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. పెదబయలు తహశీల్దార్ ఆత్మహత్యకు గల కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాడేరు ఐటిడిఎ పీవో రోణంకి గోపాలకృష్ణ వేధింపుల కారణంగానే పెదబయలు తహశీల్దారు మతి చెందారని, దీనిపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూస్తాయని తెలిపారు. విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థి, ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులను గిరిజన విద్యాసంస్థల్లోకి ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాడేరు ఐటిడిఎ పిఒను సరెండర్ చేసేంతవరకు ఉద్యమం ఆపేది లేదని హెచ్చరించారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, డిటి లీలాప్రసాద్ తదితరులు

రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హుకుంపేట : రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్, కరపత్రాలను పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టరు, రవాణా శాఖ, డిటిఒ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18 నుండి 24వ తేదీ వరకు వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట రవాణా శాఖ డిటి ఓ.లీలాపసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని మాతా శిశు మరణాలు

ప్రజాశక్తి-అనంతగిరి

శిశు మాత మరణాలు ఆగకపోవడంతో మండల వాసులు భయాందోళన చెందుతున్నారు. ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర బాలింతలు, శిశువులు మృతి చెందుతుండడంతో గిరిజన వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. మండలంలోని లుంగపర్తి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధి వాలాసి పంచాయతీలోని జెండగరువు గ్రామానికి చెందిన సొవేరి లచ్చు భార్య రక్తహీనతతో బాధపడుతూ సమయానికి సరైన వైద్య సేవలు అందక ఈ నెల 18 బుధవారం మృతి చెందింది. ఇటువంటి పరిస్థితి ప్రతి రోజూ ఉంటుంది. మండలంలోని అనంతగిరి, లుంగపర్తి, భీమవరం, పిన్నకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాల్లో ఈ రెండు నెల్లలో పలుచోట్ల పదుల సంఖ్యలో పసికందులు, బాలింతలు, గర్భిణులు మృతి చెందుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు. గిరిజనుల మరణాలు ప్రభుత్వానికి పట్టదా అంటూ ప్రశ్నిస్తున్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసి ఈ మరణాలను అరికట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ)

విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలో గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను గురువారం వన్‌టౌన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు కిలో గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం... వెలంపేట మున్సిపల్ స్టేడియం వెనుక భాగంలో గంజాయి వ్యాపారం జరుగుతుందని జె.పురుషోత్తం అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కె.శంకరరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. పోలీసులు వచ్చారని తెలిసి పారిపోవడానికి ప్రయత్నించిన మహమ్మద్ ఖుర్షిద్(31), మహమ్మద్ ముస్తాక్ (33), షేక్ సియాజ్ ఖాన్ (50)ను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు ఫిషింగ్ హార్బర్ కంచరవీధిలో నల్లమందును 30 గ్రాముల ప్యాకెట్లతో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కేసును వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి కనుసన్నల్లోనే విస్సన్నపేటలో భూ దోపిడీ

- జనసేన అధికార ప్రతినిధి దూలం గోపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ)

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కనుసన్నల్లోనే అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం శివారు విస్సన్నపేటలో 600 ఎకరాలకు పైగా భూ దోపిడీ జరిగిందని జనసేన పార్టీ అనకాపల్లి నియోజవర్గం అధికార ప్రతినిధి దూలం గోపి ఆరోపించారు. అనకాపల్లికి చెందిన జనసేన నాయకులతో కలిసి గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విస్సన్నపేటలోని సర్వే నెంబర్ 195/2లో 609.24 ఎకరాల భూములను కబ్జా చేశారని, ఇందులో అసలు సూత్రధారులుగా అమర్‌నాథ్‌తో పాటు మునగపాక మండలానికి చెందిన బొడ్డేడ ప్రసాద్ ఉన్నారని తెలిపారు. రికార్డులు తారుమారు చేసి రైతులకు మంత్రి అన్యాయం చేశారన్నారు. వక్ఫ్ భూములను కూడా ఆక్రమించేందుకు కుట్ర చేస్తున్నారని చెప్పారు. 2.5 ఎకరాల గెడ్డను కప్పేసి, 100 అడుగుల వెడల్పుతో అప్రోచ్ రోడ్డును నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై జాయింట్ కలెక్టర్‌తోగాని, రిటైర్డ్ జడ్జితో గాని విచారణ జరిపించాలని, అవసరమైతే సిబిఐ దర్యాప్తు జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ అనకాపల్లి ప్రాంత నాయకులు శ్రీరామదాసు గోవిందరావు, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను, ఆర్.సత్యం దొర తదితరులు పాల్గొన్నారు.

పెదగాడి చెరువు కబ్జాపై ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ)

పెందుర్తి మండలం పెదగాడి పంచాయితీ పరిధి సర్వే నెంబర్ 420లో ప్రభుత్వ చెరువును వైసిపికి చెందిన మాజీ సర్పంచి కోన శ్రీనివాసరావు కబ్జా చేసి ఫ్లాట్లు వేసి అమ్మేస్తున్నారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం పెదగాడి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. అనంతరం బండారు మీడియాతో మాట్లాడుతూ ఇదే అంశంపై పెందుర్తి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, వారం రోజులైనా ఆయన కనీసం స్పందించలేదని తెలిపారు. పెందుర్తి అధికార పార్టీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ తహశీల్దారుకు హుకుం జారీ చేయడంతో ఆయన ఎటువంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారని ఆరోపించారు. అందుకే ఆర్‌డిఓను కలిసి సర్వే నెంబర్ 420లో జరుగుతున్న కబ్జాపై ఫిర్యాదు చేశామని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే హైకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. ఒకవేళ తాను తప్పుడు ఆరోపణలు చేశానని నిరూపిస్తే ఇదే కలెక్టరేట్ దగ్గర ఆత్మహత్య చేసుకుంటానన్నారు. చింతగట్ల గ్రామంలో వైసిపి నేత కనకరాజు జుత్తాడాలో ఎస్‌సి సామాజిక తరగతి వారికి చెందిన నాలుగు ఎకరాల భూమిని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు.

ఎల్ఐసిని ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి-చోడవరం

జాతీయబీమా సంస్థ ఎల్ఐసిని ప్రయివేటీకరించకుండా ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఎల్ఐసి ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం ఎల్ఐసి జాతీయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. 1956లో జాతీయాకరణ తర్వాత ఎల్ఐసి దినదినాభివృద్ధి చెందుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు బాసటగా నిలిచిందని, లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చుకుందన్నారు. అలాంటి సంస్థను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. ఎల్ఐసితోపాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కల్యాణ్ కుమార్, సహాయ కార్యదర్శి నూకరాజు, కోశాధికారి హర్షత్, సభ్యులు పద్మజ, కెపిఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి, చిత్రంలో వాసుపల్లి, పంచకర్ల, తైనాల, రెహమాన్ తదితరులు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

వైసిపి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని టిటిడి చైర్మన్, వైసిపి ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ దక్షిణ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో తెలుగుదేశం సాగిస్తున్న దొంగ ఓట్ల నమోదు కార్యక్రమం పట్ల కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, బూత్ స్థాయిలో టిడిపి నమోదు చేయిస్తున్న దొంగ ఓట్లను అడ్డుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మితే రాష్ట్రంలోని కోట్లాది మంది పేద ప్రజానీకం పథకాలకు దూరమైపోతారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి గురించి ఇంటింటికి వెళ్లి తెలియజెప్పాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో విశాఖ దక్షిణ ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్ కుమార్‌ను గెలిపించాలన్నారు. పార్టీలో అంతర్గత సమస్యలుంటే నాలుగు గోడల మధ్య చర్చిద్దామని, దాని కోసం తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ సమావేశంలో ఆయన్ను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు మాజీ శాసన సభ్యులు తైనాల విజయ్ కుమార్, రెహమాన్, మత్స్య కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయండి

658వ రోజు కొనసాగిన జెఎసి దీక్షలు

నినాదాలు చేస్తున్న ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు నగరంలో ఈ నెల 30న జరుగే ప్రజా గర్జనను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పడాల రమణ, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 658వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం ప్రైవేటీకరిస్తామని ప్రకటన చేసిన దగ్గర నుండి కూర్మన్నపాలెం జంక్షన్ 707 రోజులుగా, గాంధీ విగ్రహం వద్ద 658 రోజులుగా నిరసన దీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ఉక్కు నిర్వాసితులందరికీ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని అధికార, ప్రతిపక్ష పార్టీలు పత్రికల్లో, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడం తప్పా ఆందోళన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో భీంపల్లి రాము, ఎ.కామరాజు, ఎం.సాహెబ్,

ఫ్లిప్‌కార్ట్ 'రిపబ్లిక్ డే స్పెషల్' ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ)

ఫ్లిప్ కార్ట్ గ్రూపు ఫ్లిప్ కార్ట్ హోల్‌సేల్, డిజిటల్ బి2బి మార్కెట్ ప్లేస్, సభ్యుల కోసం రిపబ్లిక్ డే స్పెషల్‌ను ప్రారంభించినట్లు ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్ఎన్ తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'మునాఫేకి పరేడ్' థీమ్‌తో ఆఫర్ వ్యవధిలో విస్తృతమైన ఉత్పత్తుల ఎంపికపై మునుపెన్నడూ చూడని డీల్‌తో లాభాలు, పొదుపులను పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

సుందర నగరంగా విశాఖ

టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ

విశాఖ నగరాన్ని సుందర విశాఖగా తీర్చి దిద్దాలని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కైలాసగిరి కొండపై జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖకు మణిహారమైన కైలాసగిరిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆర్‌కె.బీచ్ నుండి రుషికొండ వరకు సుమారు 12 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని పర్యాటకులు ఆకర్షించే విధంగా తీర్చి దిద్దుతున్నామని చెప్పారు. పర్యాటకులకు భద్రత కల్పించడంలో భాగంగా సుమారు 38 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌కె.బీచ్ నుండి రుషికొండ వరకు సముద్రపు ఒడ్డున విద్యుద్దీకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకులకు వసతి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ నిషేధించడంలో భాగంగా ఈ నెల 26 నుండి నగరంలో ప్లాస్టిక్‌తో కవర్లు, బేనర్లు తదితర వస్తువులు తయారు చేయడం, వినియోగించడం చేయరాదని సూచించారు. మార్చి 3, 4 తేదీలలో పారిశ్రామిక వేత్తలతో జరగబోయే గ్లోబల్ సమ్మిట్, మార్చి 28, 29 తేదీలలో నిర్వహించబోయే జి20 సదస్సుకు వివిధ దేశాల నుండి హాజరవుతున్న ఆహూతులను ఆకర్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, డిఎఫ్ఓ శాంతి స్వరూప్, అధికారులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పిఎం పాలెం

విశాఖపట్టణం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జూనియర్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొమ్మాది సమీపంలో ఉన్న నవోదయ పాఠశాల విభిన్న ప్రతిభావంతులు పలు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని కే.తేజశ్రీ 100 మీటర్ల స్ప్రింట్ విభాగంలో స్వర్ణ పతకాన్ని, 400 మీ.స్ప్రింట్ విభాగంలో రజత పతకాన్ని గెలుపొంది ఈ నెల 27న గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. 6వ తరగతి విద్యార్థి సాల్మన్‌కుమార్ 100, 400 మీటర్ల స్ప్రింట్ విభాగంలో కాంస్య పతకాన్ని, 7వ తరగతి విద్యార్థిని జి.తేజస్విని వంద మీటర్ల విభాగంలో కాంస్య పతకం, 9వ తరగతి విద్యార్థిని కృష్ణ తేజస్విని షాట్ పుట్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎమ్‌వి.రమణమ్మ, నీలా ప్రసాద్‌లను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్‌సి వర్గీకరణపై వినతి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : త్వరలో జరుగనున్న పార్లమెంట్ సమావేశాలలో ఎస్‌సిలను ఎబిసిడిలుగా వర్గీకరణ చేసే బిల్లుకు బిజెపి మద్దతు ఇవ్వాలని, ఆ దిశగా పార్టీ అగ్ర నాయకత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు నాయకత్వంలో ప్రతినిధి బృందం గురువారం జ్యోతి థియేటర్ సమీపంలోని కిన్నెర కంఫర్ట్ హోటల్‌లో రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావుకు వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఉత్తరాంధ్ర ముఖ్య సలహాదారు కోట్ర కన్నారావు, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మోర్తా రమణ, అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి ఎలుసూరి గాటీలు, ఎంఇఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు అత్తోటి రవికుమార్, నర్సీపట్నం నియోజవర్గం ఇన్‌ఛార్జి చింతాడ నూకేష్. ఉత్తరాంధ్ర రెల్లి సంక్షేమ సంఘం నాయకులు కస్తూరి వెంకటరావు, ఆకుల ఆనందరావు, ప్రేమ్ మోర్త, బాదం హనుమంతరావు, ఎయు ఫిజిక్స్ ఫ్యాకల్టీ డాక్టర్ నందిగాం మురళి పాల్గొన్నారు.